సాక్షి ప్రకాశం

ఆదివారం । 23 । మార్చి । 2025



ఎస్సీ వర్గీకరణపై చిత్తశుద్ధి లేదు
ఎస్సీ వర్గీకరణపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మాజీ మంత్రి, కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సురేష్ అన్నారు. - 8లో..



పట్టపగలే మూడు గృహాల్లో చోరీ
పామూరు పట్టణంలో శనివారం ఉదయం మూడు గృహాల్లో వరుస చోరీలు జరిగాయి. రూ.3.68 లక్షల నగదు, 76 గ్రాముల బంగారం మాయమైంది. - 8లో..

గరిష్టం/కనిష్టం
36/25

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

రంజాన్ వేళలు

ఆదివారం	ఇఫ్తార్	
సాయంత్రం	గం 6 : 29	
సోమవారం	సహరి	
ఉదయం	గం 4 : 53	

న్యూస్‌రీల్

ఏప్రిల్ 1 నుంచి అంబేడ్కర్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్


ఒంగోలు: భీమ్ సేవా సమితి, భీమ్ ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 1 నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు భీమ్ సేవా సమితి ప్రతినిధి దాసరి కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మంగమూరు రోడ్డులోని మర్రిచెట్టు వద్ద గ్రౌండులో జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మొదటి బహుమతి రూ.30 వేలు, ద్వితీయ బహుమతి రూ.20 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలుగాను నిర్ణయించారని, ఈ పోటీల్లో మ్యాన్ ఆఫ్ ది సిరీస్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతులు అదనం అని తెలిపారు. ఆసక్తిగల వారు పూర్తి వివరాలకు సెల్ నంబర్లు: 9505690158 లేదా 9390982008లను సంప్రదించాలన్నారు.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారిణులు

ఒంగోలు: జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారిణులు ఎంపికయ్యారని జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి జి.నవీన్ తెలిపారు. ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు ఒడిశా రాష్ట్రం కటక్ పట్టణంలో జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగే 27వ జాతీయ స్థాయి అండర్ 14 సబ్ జూనియర్ పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. సాబర్ విభాగంలో వి.లేఖన బ్రాంజ్ మెడల్, ఈపీ విభాగంలో టి.మిథుల చౌదరి బ్రాంజ్ మెడల్ సాధించారు. ఇటీవల కృష్ణా జిల్లా కంచికచర్లలో జరిగిన 11వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఫెన్సింగ్ పోటీల్లో వ్యక్తిగత విభాగంలో వీరు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారిణులను కోచ్‌లు డి.రాజు, జి.అనీల్ అను ప్రకాశం జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు అభినందించారు.

పసుపు రైతుకు ఈసారి కన్నీళ్లు తప్పేట్లు లేవు. ఆశించిన మేర దిగుబడి లేదు. అదే సమయంలో మార్కెట్‌లో గిట్టుబాటు ధర కూడా దక్కట్లేదు. గంపెడాశతో మార్కెట్‌కు పంటను తీసుకొస్తున్న రైతులు.. ధరలు చూసి నివ్వెరపోతున్నారు. క్వింటా ధర రూ.7 వేలు పలుకుతుండడంతో నష్టాల పలకరింపు తప్పదని తేలడంతో రైతు దిగాలు పడ్డాడు. జిల్లాలో మొన్న పత్తిరైతు.. నిన్న మిర్చి, కంది, శనగ రైతులు.. నేడు పసుపు రైతు నష్టాల బాట పడుతున్నాడు.

- పెరిగిన పెట్టుబడులు..తగ్గిన దిగుబడులు
- గతేడాదితో పోలిస్తే సగానికి పడిపోయిన ధరలు
- జిల్లాలో సుమారు వెయ్యి ఎకరాల్లో పసుపు సాగు
- ఎకరాకు లక్షన్నర వరకు వ్యయం
- కనీసం పెట్టుబడి వచ్చే పరిస్థితి కరువు
- ఆశలన్నీ అంతర పంటపైనే పెట్టుకున్న రైతులు



తవ్విన పసుపును కుప్పగా వేసిన రైతులు

ప్రకాశించని పసుపు

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఏవిధంగా లబ్ధి చేకూరడం లేదు. గిట్టుబాటు ధరలు, పంట నష్టపరిహారం, పంటల బీమా అందలేదు. కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే పీఎం కిసాన్ డబ్బులు అకౌంట్లలో పడుతున్నాయే తప్పా రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న రైతుభరోసా డబ్బులు మాత్రం ఇంత వరకు రైతులకు ఇవ్వలేదు. దీంతో రైతులు అన్ని విధాలుగా నష్టపోతున్నారు. పెరిగిన పెట్టుబడులు, ఎరువుల ధరలు, బోర్లలో వచ్చీరాని నీళ్లతో ఆరు గాలం శ్రమించి పండించుకున్న పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించకపోతే రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని, ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

కంభం:

రాష్ట్రంలో పసుపు పంట ఎక్కువగా సాగయ్యే జిల్లాల్లో ప్రకాశం ఒకటి. జిల్లాలోని పశ్చిమ ప్రాంతమైన గిద్దలూరు, యర్రగొండపాలెం, కనిగిరి, దర్శి నియోజకవర్గాల పరిధిలోని పలు మండలాల్లో దీనిని పండిస్తున్నారు. కంభం, గిద్దలూరు, బేస్తవారి పేట, కొమరోలు, రాచర్ల, అర్ధవీడు, సీఎస్ పురం, దర్శి మండలాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో సాగు చేస్తున్నారు. అనుకున్న స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో బోర్లపైనే ఆధారపడి రైతులు పసుపు వేశారు. పంట చేతికొస్తే అప్పులు తీరుతాయని గంపెడాశలు పెట్టుకున్నారు. పది రోజుల నుంచి పసుపు తవ్వకాలు ప్రారంభమయ్యాయి. దిగుబడి చూస్తుంటే సగానికి పైగా తగ్గిపోవడంతో రైతు కంటిమీద కునుకు కరువైంది. ఎకరాకు కనీసం 25 క్వింటాళ్లు కూడా రాకపోవడంతో ఈ ఏడాది కూడా అప్పులపాలు కాక తప్పదని రైతన్నలు వాపోతున్నారు.

ఎకరాకు పెట్టుబడి రూ.1.5 లక్షలు:
పసుపు పంటకు పెట్టుబడి అధికంగా ఉంటుంది. విత్తనం పసుపు కొనుగోలు, రసాయనిక ఎరువులు, పురుగుల మందులు, కలుపుతీయడం, నీటి పారుదలకు కలిపి సుమారు లక్ష రూపాయల వరకు వస్తుంది. పసుపు పంటను తవ్విన తర్వాత నూర్పిడికి, పాలిషింగ్‌కు రూ.25 వేల వరకు ఖర్చు అవుతుంది. మనుషులతో పసుపు తవ్వించడానికి ఎకరాకు రూ.15 వేల వరకు అవుతుండటంతో రైతులు పసుపును ట్రాక్టర్లతో దున్ని ఆ తర్వాత మహిళా కూలీలతో ఏరుకొని గ్రేడింగ్ చేసుకుంటున్నారు. కౌలు రైతులైతే ఎకరాకు కౌలు కింద రూ.20 నుంచి రూ.30 వేల వరకు కౌలు చెల్లించాల్సి వస్తుండటంతో వారికి పెట్టుబడి రూ.లక్షన్నర దాటుతుంది.

తగ్గిన దిగుబడి

ఆశించిన స్థాయిలో వర్షపాతం లేకపోవడంతో ఈ ఏడాది పసుపు పంటను బోర్లపైనే ఎక్కువగా ఆధారపడి రైతులు సాగు చేసుకున్నారు. పసుపు పంటకు నీరందించేందుకు చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. పంటకు సరిపడా నీరందకపోవడం, తెగుళ్లు సోకడం తదితర కారణాలతో దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. ఎకరాకు దాదాపు 50 నుంచి 60 క్వింటాళ్ల వరకు దిగుబడి రావాల్సి ఉండగా 20 నుంచి 25 క్వింటాళ్లకు పడిపోయిందని, దీంతో పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పసుపును ట్రాక్టర్ సహాయంతో తవ్వుతున్న రైతులు



పసుపులో అంతర పంటగా వేసిన అరటి పంట



పొలంలో పసుపు కొమ్ములు ఏరుతున్న కూలీలు

సగానికి పడిపోయిన ధరలు
గతేడాది క్వింటా రూ.13 వేల వరకు పలికిన ఎండు పసుపు ప్రస్తుతం సగానికి పడిపోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఎండు పసుపు క్వింటా ధర రూ.7– రూ.8 వేల వరకు ఉందని రైతులు చెబుతున్నారు. ఇటు దిగుబడులు రాక, అటు ధరలు లేక రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని వాపోతున్నారు. పండిన పంటను నిల్వ ఉంచుకొని అప్పులు పెంచుకోవడం ఎందుకులే అనుకొని రైతులు వచ్చిన ధరలకే దళారులకు అమ్మేస్తుండటంతో రైతుల కన్నా దళారులకు అధిక లాభాలు వస్తున్నాయి.

ఆశలన్నీ అంతర పంటపైనే..
గతంలో పసుపులో అంతర పంటగా చెరకు సాగు చేసే వారు. ప్రస్తుతం అడవి పందుల బెడద అధికంగా ఉండటంతో చెరకు సాగు తగ్గిపోయింది. దాని స్థానంలో రైతులు ఎక్కువగా అరటి సాగు చేస్తున్నారు. పసుపు పంట చేతికొచ్చే మూడు నెలల ముందు రైతులు పసుపు సాళ్లలో అరటి పిలకలు వేస్తారు. పసుపు పంట తవ్వకాలు పూర్తయ్యే సరికి అరటి పంటకు 3 నెలల కాలం కలసి వస్తుంది. తద్వారా అరటి తోటలు త్వరగా కాపు వస్తుంది. కనీసం అరటి సాగన్నా కలిసొస్తుందో లేదో అని రైతులు ఎదురుచూస్తున్నారు.

పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు



మూడు ఎకరాల్లో పసుపు సాగు చేశాను. సుమారు రూ.3 లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. పసుపు తవ్వుతుంటే ఆశించిన స్థాయిలో దిగుబడి కనబడటం లేదు. ధరలు కూడా సగానికి పడిపోయాయని చెబుతున్నారు. దీంతో ఈ ఏడాది పెట్టుబడులు కూడా వస్తాయో రావో అన్న అనుమానం కలుగుతుంది. పసుపు తవ్విన తర్వాత వండి, పాలిషింగ్ చేయడానికి అదనంగా రూ.50 వేల వరకు ఖర్చు వస్తుంది.

– **షేక్ అబ్దుల్ వహీద్**, పసుపు రైతు, కంభం

గిట్టుబాటు ధరలు కల్పించాలి



రైతులు గిట్టుబాటు ధరలు లేక నష్టపోతున్నారు. ఏడాది పాటు కష్టపడి పండించుకున్న పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారు. చేసిన అప్పులకు వడ్డీలు పెరిగి వారు అప్పుల పాలవుతున్నారు. పసుపు పంటకు గిట్టుబాటు ధరలు కల్పించి రైతులను ఆదుకోవాలి.

– **నెమలిదిన్నె చెన్నారెడ్డి**, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, కంభం

బాబు మాటలతో జనం మోసపోయారు



వైఎస్సార్‌సీపీ ప్రభపై మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పక్కన బూచేపల్లి వెంకాయమ్మ



భారీగా తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

- సూపర్ సిక్స్ అమలు చేయలేదు
- మహిళలను మోసం చేస్తే చీపుర్లు, చెప్పులతో కొడతారు
- మరొక వ్యక్తి ఎన్నికల ముందు ప్రశ్నిస్తా అని కనిపించకుండా పోయాడు
- ధ్వజమెత్తిన దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

దర్శి: గత ఎన్నికల్లో చంద్రబాబు మోసపు మాటలు విని రాష్ట్ర ప్రజలు దారుణంగా మోసపోయారని దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సువర్చలా సమేత ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభపై ఆయనతో పాటు, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ హాజరయ్యారు. ముందుగా ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఎమ్మెల్యేను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

మళ్లీ జగన్ సీఎం అవడం ఖాయం:
విద్యుత్ ప్రభపై బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల సందర్భంగా వచ్చిన కార్యకర్తలు, అభిమానులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. తొమ్మిది నెలల క్రితం తన గెలుపు కోసం కృషి చేసి ఎన్నికల్లో ఆదరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. జగన్ అంటే ప్రతి ఒక్కరికీ గుండె నిండా ధైర్యం, మనస్సు నిండా ప్రేమ ఉందన్నారు. జగన్న పాలన ప్రతి కార్యకర్త కాలర్ ఎగరేసుకునేలా ఉందన్నారు. గత ఎన్నికల్లో జగనన్నను సీఎం చేసుకోలేకపోయామని ప్రజలు బాధపడుతున్నారన్నారు. ఈ సారి ఎన్ని కూటములు ఎదురైనా జగనన్న సీఎం అవ్వడం ఖాయమని స్పష్టం చేశారు. జగనన్నకు అబద్ధం చెప్పడం చేతకాదన్నారు. చంద్రబాబు అన్నీ అబద్ధాలు చెప్పి, మోసపూరిత హామీలు ఇచ్చి సీఎం అయ్యి ప్రజలను మళ్లీ దారుణంగా మోసం చేస్తున్నారన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా వారిని ఓట్లు అడిగేందుకు వెళ్తే చెప్పులు, చీపుర్లతో కొడతారని స్పష్టం చేశారు. ఎన్నికల ముందు మరొక వ్యక్తి నేను ప్రశ్నిస్తా ప్రశ్నిస్తా అని అన్నారని, ఎన్నికలు అయిపోయిన తరువాత ప్రశ్నిస్తానన్న ఆయన ఎక్కడా కనిపించడం లేదని ఎద్దేవా చేశారు.

గిట్టుబాటు ధరలు అందక రైతుల ఇక్కట్లు:
జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వంలో రైతులకు గిట్టుబాటు ధరలు లేవన్నారు. జగనన్న హయాంలో క్వింటా మిరప ధర రూ.30 వేలు ఉంటే, ప్రస్తుతం రూ.10 వేలు కూడా లేదన్నారు. ఏటా రైతులకు రూ.20 వేలు ఇస్తామని చెప్పి చంద్రబాబు రైతులను నిలువునా మోసగించారన్నారు. వ్యవసాయంలో నష్టాలు వచ్చి రైతులు పురుగు మందు తాగి ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లైనా లేదన్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఉద్యోగాలు లేని వారికి నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని చెప్పి యువతను దారుణంగా మోసం చేశారన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైద్య విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ ఎస్ఎం బాషా, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, దొనకొండ మాజీ మండల కన్వీనర్ కాకర్ల క్రిష్టారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కేవీ రెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు ఇరుగుల శ్రీనివాసరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కేసరి రాంభూపాల్‌రెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు కొల్లా ఉదయభాస్కర్, ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు బండి గోపాల్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ షకీలా అమీన్ బాషా, నాయకులు కర్లా భాస్కర్‌రెడ్డి, కుందురు నరశింహారెడ్డి, కేసరి ప్రసాద్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రూ.30 వేల బిల్లుకు రూ.20 వేల లంచం !

- ఔట్‌సోర్సింగ్ వాచ్‌మన్ జీతం బిల్లు చేసేందుకు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కక్కుర్తి
- ఏసీబీకి పట్టుబడిన ప్రిన్సిపాల్

చీమకుర్తి: నెలకు రూ.15 వేల జీతం కోసం ఔట్‌సోర్సింగ్‌పై పనిచేసే వాచ్‌మెన్‌కు రెండు నెలల జీతం రూ.30 వేల బిల్లు చేయాలంటే తనకు రూ.20 వేలు లంచం ఇవ్వాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డిమాండ్ చేశాడు. తానంత ఇచ్చుకోలేనని ఎంత వేడుకున్నా కనికరించకపోవడంతో చివరకు వాచ్‌మన్ ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ డీఎస్పీ ఎస్.శిరీషా, స్థానిక గిరిజన గురుకుల పాఠశాల సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. చీమకుర్తి గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో వాచ్‌మెన్‌గా గురవయ్య ఏడు సంవత్సరాలుగా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నాడు. ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ మూడేళ్ల నుంచి అక్కడ పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ నెల 23 నుంచి దాదాపు రెండు నెలలు పాటు వేసవి సెలవులు కావడంతో ఆ రెండు నెలలకు జీతం ఇవ్వాలంటే రూ.20 వేలు లంచం ఇవ్వాలని ప్రిన్సిపాల్ డిమాండ్ చేశాడు. బిల్లు చేస్తే తనకు వచ్చేదే రూ.30 వేలు... అలాంటిది రూ.20 వేలు ఇచ్చుకోలేనని ప్రిన్సిపాల్‌ను వేడుకున్నాడు. అయినా ప్రిన్సిపాల్ కనికరించకపోవడంతో చేసేది లేక గురవయ్య నేరుగా ఒంగోలులోని ఏసీబీ డీఎస్పీ కార్యాలయ సిబ్బందికి తన గోడు చెప్పుకున్నాడు. ఏసీబీ అధికారులు సూచించిన ప్రకారం శనివారం సాయంత్రం గురవయ్య తన వద్ద రూ.17,500 మాత్రమే ఉన్నాయని ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్‌కు ఇచ్చాడు. అదే సమయంలో డీఎస్పీ ఎస్.శిరీషా ఆధ్వర్యంలో వారి సిబ్బందితో కలిసి అక్కడకు వచ్చి ప్రిన్సిపాల్‌ను అదుపులోకి తీసుకున్నారు. ప్రిన్సిపాల్ వద్ద ఉన్న రూ.17,500ను రెడ్‌హ్యాండెడ్‌గా స్వాధీనం చేసుకున్నారు. ప్రిన్సిపాల్‌ను రిమాండ్‌కు పంపించనున్నట్లు డీఎస్పీ శిరీషా తెలిపారు. ఏసీబీ ఇన్‌స్పెక్టర్‌లు సీహెచ్.శేషు, రమేష్‌బాబు, ఎస్సైలు జేబీఎన్ ప్రసాద్, మస్తాన్ షరీఫ్, వారి సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు. నెలకు రూ.1.50 లక్షల జీతం తీసుకుంటున్న ప్రిన్సిపాల్ కేవలం రూ.15 వేల జీతంతో తన వద్ద నమ్మకంగా పనిచేస్తున్న వాచ్‌మన్ నుంచి డబ్బులు డిమాండ్ చేసి చివరకు తన ఉద్యోగానికి ముప్పు తెచ్చుకున్నాడని పాఠశాల సిబ్బందే ఈసడించుకుంటున్నారు.



ఏసీబీ దాడిలో పట్టుబడిన చీమకుర్తి గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్

దామచర్ల ఇంటి వద్ద హైడ్రామా

- చెక్ బౌన్స్ కేసులో రియల్టర్ విజయ భాస్కర్ కోసం తెలంగాణ పోలీసులు
- లోకేషన్ చూపించడంతో జీకే అపార్ట్‌మెంట్‌లోని ఎమ్మెల్యే ఇంటికి
- ఆ సమయంలో హైదరాబాద్‌లో ఎమ్మెల్యే

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: చెక్ బౌన్స్ కేసులో విజయవాడకు రియల్ ఎస్టేట్ వ్యాపారి విజయ భాస్కర్‌ను అరెస్టు చేసేందుకు తెలంగాణ పోలీసులు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఇంటికి రావడం జిల్లాలో కలకలం రేగింది. రియల్ ఎస్టేట్ వ్యాపార లావాదేవీలకు సంబంధించి హైదరాబాద్ కు చెందిన వ్యక్తికి విజయభాస్కర్ చెక్ రాసిచ్చినట్లు తెలుస్తోంది. ఆ చెక్ బౌన్స్ కావడంతో బాధితులు హైదరాబాద్ లోని మాదాపూర్ పోలీసులు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ కేసు వ్యవహారంలో విజయ భాస్కర్ ను అరెస్టు చేసేందుకు మాదాపూర్ పోలీసు స్టేషన్ నుంచి ఒక ఎస్సై, ఇద్దరు కానిస్టేబుళ్ల బృందం అతని లొకేషన్ ఆధారంగా ఒంగోలు వచ్చారు. శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో లోకేషన్ చూపించిన ఇంటికి వెళ్లారు. అది ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఇల్లు కావడం, వచ్చిన వారు మఫ్టీలో ఉండడం, వారు ఇంట్లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించడంతో అక్కడి సిబ్బంది అడ్డుకున్నారు. ఆ సమయంలో ఎమ్మెల్యే దామచర్ల, ఆయన కుటుంబ సభ్యులు ఎవరూ ఇంట్లో లేరు. అమెరికా వెళ్లేందుకు కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లారు. తెలంగాణ పోలీసులు వచ్చిన సమాచారాన్ని టీడీపీ నాయకులు ఆయనకు తెలిపారు. ఎమ్మెల్యే సలహా ప్రకారం పీఏ అనిల్.. ఎస్పీ ఏఆర్ దామోదర్ కు తెలియజేశారు. ఎస్పీ ఆదేశాలతో తాలూకా సీఐ అజయ్ కుమార్, వన్ టౌన్ సీఐ నాగరాజు అక్కడికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే ఇంటి వద్దకు చేరుకోవడంతో కాసేపు గందరగోళం ఏర్పడింది. అయితే ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తెలంగాణ పోలీసులు సీఐ నాగరాజుతో కలిసి వన్ టౌన్ స్టేషన్ కు చేరుకున్నారు. కాసేపటి తరువాత వాళ్లు హైదరాబాద్ వెళ్లిపోయారు. అయితే దామచర్లకు సదరు విజయ భాస్కర్ సన్నిహితుడని ప్రచారం జరుగుతోంది.

పెట్రోలు బంకుల్లో విస్తృత తనిఖీలు

సాక్షి ఎఫెక్ట్..

ఒంగోలు సబర్బన్: జిల్లాలోని పలు పెట్రోలు బంకుల్లో ప్రభుత్వానికి చెందిన మూడు విభాగాల అధికారులు శనివారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. 'సాక్షి' దినపత్రికలో శనివారం 'కల్తీ కమ్మక్కు...కేసుల గమ్మత్తు' అన్న శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన తూనికల, కొలతల విభాగం, సివిల్ సప్లయీస్ విభాగం, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. నగరంలోని అద్దంకి బస్టాండ్ పెట్రోల్ బంకుతో పాటు నగరంలో ఐదు పెట్రోలు బంకుల్లో, పేర్నమిట్ట, మర్రిచెట్లపాలెం పెట్రోలు బంకుల్లో తనిఖీలు చేశారు. వినియోగదారులకు అనుమానం వచ్చినప్పుడు అక్కడికక్కడే పెట్రోలు, డీజిల్‌ను పరీక్షలు చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు.



పెట్రోల్ బంకుల్లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

జిల్లా జూనియర్ బాల, బాలికల హాకీ జట్ల ఎంపిక

సంతనూతలపాడు: రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జూనియర్ హాకీ బాల, బాలికల జట్ల ఎంపిక శనివారం సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారితో జిల్లా జట్లను ఎంపిక చేశారు. సంతనూతలపాడు ఎస్సై అజయ్ బాబు, స్కూల్ ప్రధానోపాధ్యాయుడు డీవీఎల్.నరసింహారావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సుందరరామిరెడ్డి, పీడీ కే.వనజ, హాకీ అసోసియేషన్ సభ్యులు టి.రవికుమార్, పి.రవి, మాధవరావు, విద్యా కమిటీ చైర్మన్ ఆకుల బ్రహ్మయ్య, డైట్ సీనియర్ లెక్చరర్ ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన జిల్లా జూనియర్ బాలికల హాకీ జట్టు

క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ రాస్తారోకో



పోలీసుస్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న కొలుకుల గ్రామస్తులు

యర్రగొండపాలెం: మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక పోలీసుస్టేషన్ ఎదుట కొలుకుల గ్రామానికి చెందిన ప్రజలు శనివారం రాస్తారోకో చేశారు. ఈ నెల 19వ తేదీన మండలంలోని కొలుకుల విద్యుత్ సబ్ స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న వెలివెల చంటి మోటారు బైక్‌పై పెద్దారవీడు మండలం కుంట వద్దకు వెళ్తున్నాడు. స్థానిక అనకుంట వద్ద ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొనడంతో అయనతో పాటు ఆటోలో ప్రయాణం చేస్తున్న సూర్యనారాయణ తీవ్రంగా గాయపడ్డాడు. వీరిని పల్నాడు జిల్లా నరసరావుపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స చేయిస్తున్నారు. చికిత్స పొందుతున్న చంటి శుక్రవారం రాత్రి మృతి చెందాడు. చంటికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారని, వారు అనాథలయ్యారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వీరి కుటుంబానికి న్యాయం చేయాలని వారు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పోలీసులతో చర్చించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పి.చౌడయ్య చెప్పినా వారు సంతృప్తి చెందలేదు. మృతుడు చంటి కుటుంబాన్ని ఆదుకునే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. కాసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. పోలీసులు వారికి నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. ఆటోలో ప్రయాణం చేస్తూ ప్రమాదంలో గాయపడిన మండలంలోని అమానిగుడిపాడుకు చెందిన సూర్య సత్యనారాయణ పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉందని తెలిసింది.

ఎస్సీ వర్గీకరణపై చిత్తశుద్ధి లేదు

- వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: ఎస్సీ వర్గీకరణపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, వర్గీకరణపై బిల్లు చేయకుండా కేవలం ఆర్డినెన్స్ జారీ చేయటమే ఇందుకు నిదర్శనమని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. సింగరాయకొండలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ పై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు పట్ల వైఎస్సార్ సీపీకి మొదటి నుంచి చిత్తశుద్ధి ఉందన్నారు. తాము ఎప్పుడూ ఒకేమాట మీద ఉన్నామన్నారు. సుప్రీం కోర్టు జడ్జిమెంటు ప్రకారం అందరికీ మేలు జరగాలన్న విషయంలో నిస్పక్షపాతంగా వ్యవహరించాలన్నదే తమ పార్టీ లక్ష్యమన్నారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బడుగు, బలహీన వర్గాలు, ఎస్సీలకు నామినేటెడ్ పోస్టులు, మంత్రి పదవులు, కార్పొరేషన్ పదవులు, సంక్షేమ పథకాలు దామాషా ప్రకారం ఇచ్చామని గుర్తు చేశారు. సుప్రీంకోర్టు జడ్జిమెంటు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఆదిమూలపు సురేష్

అమలు చేసే విషయంలో కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్న విషయం అసెంబ్లీ సమావేశాల్లో తేటతెల్లమైందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం చట్టం చేశాం, ఒక కమిటీని వేశాం, ఈ విధంగా కమిటీ నివేదిక ఇచ్చిందని చట్టసభల్లో ప్రవేశపెట్టి చర్చకు అవకాశం ఇచ్చేవారన్నారు. ఒక చట్టసభలో మొదటగా బిల్లు ప్రవేశపెట్టడం, తరువాత దానిపై చర్చ జరపటం చివరగా బిల్లు పాస్ చేసి ఆమోదానికి గవర్నర్‌కు పంపడం ఇది పద్ధతి అని.. ఈ పద్ధతిని తెలంగాణ ప్రభుత్వం తూచా తప్పకుండా అమలు చేసిందని గుర్తు చేశారు. కానీ మన రాష్ట్రంలో మాత్రం ఒక లైను స్టేట్‌మెంటు ఇచ్చారన్నారు. అసెంబ్లీలో చట్టం చేయకుండా బిల్లు ప్రవేశపెట్టకుండా అసెంబ్లీ అయిపోయిన తరువాత గవర్నర్‌కు పంపించి ఆర్డినెన్స్ తీసుకుని వచ్చి తరువాత చేద్దామని చెప్పటమేంటని ప్రశ్నించారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లు ప్రజల అనుమానాలను నివృత్తి చేయాల్సి ఉందన్నారు. ఉద్యోగ సంఘాల నాయకులు రిజర్వేషన్ విధానాన్ని, రోస్టర్ పాయింట్లను ప్రశ్నిస్తున్నారన్నారు. జిల్లా యూనిట్‌గానా, రాష్ట్రం యూనిట్‌గా తీసుకుంటారో చెప్పాల్సి ఉందని, మళ్లీ 2025–26 జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్ పద్ధతి మారుస్తామని చెబుతున్నారని డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. ఆయన వెంట పార్టీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్ రెడ్డి, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ సుల్తాన్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యనమల మాధవి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చుక్కా కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

కుటుంబాన్ని హతమార్చేందుకు యత్నం

అర్ధవీడు (బేస్తవారిపేట): పాతకక్షల నేపథ్యంలో ఓ కుటుంబాన్ని హతమార్చేందుకు ప్రయత్నించిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి అర్ధవీడు మండలంలోని బొమ్మిలింగం గ్రామంలో జరిగింది. స్థానికంగా నివాసం ఉంటున్న గోదేసి రాజేంద్ర ప్రసాద్ అనే వ్యక్తి ఇంటి సమీపంలోని విద్యుత్ స్తంభం నుంచి విద్యుత్ సర్వీస్ తీగను నిందితులు తొలగించారు. ఆ తీగపైన ఉండే ప్లాస్టిక్ మెటీరియల్‌ను కూడా తొలగించి ఇంటి వెనుక వైపున్న డోర్, బాత్‌రూమ్ వద్ద తీగను పడేశారు. శనివారం తెల్లవారుజామున రాజేంద్రప్రసాద్ తల్లి నరసమ్మ బాత్‌రూంకు వెళ్లేందుకు తలుపు తీయగానే స్వల్పంగా విద్యుత్ షాక్ తగిలి పెద్దగా కేకలు వేసింది. దీంతో కుటుంబ సభ్యులు గమనించి అప్రమత్తం కావడంతో అందరికీ ప్రమాదం తప్పింది. ఎవరో తమ కుటుంబాన్ని హతమార్చేందుకు విద్యుత్ తీగలు తెచ్చి పడేసినట్లు వారు గుర్తించారు. రెండేళ్ల క్రితం పొలంలో స్టార్టర్ పెట్టెకు విద్యుత్ సరఫరా చేసి తమను చంపేందుకు కుట్ర పన్నారని, ఆ సమయంలో అదృష్టవశాత్తూ స్టార్టర్‌పై గోతం తొలగించే సమయంలో స్వల్ప విద్యుత్ ఘాతానికి గురై ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నామని వారు తెలిపారు .తొమ్మిది నెలల క్రితం ఇంటి వద్ద ఆరుబయట నిద్రిస్తున్న సమయంలో కత్తితో పొడిచినట్లు బాధితులు తెలిపారు. ఈ కేసుల్లో నిందితులు ఇటీవల బెయిల్‌పై బయటకు వచ్చారని, వారే తమను చంపేందుకు శుక్రవారం అర్ధరాత్రి కూడా విద్యుత్ తీగల ద్వారా కుట్ర పన్నారని బాధితుడు రాజేంద్రప్రసాద్ ఆరోపించారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై సుదర్శన్‌యాదవ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. రాజేంద్రప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



రాజేంద్రప్రసాద్ ఇంటి ఆవరణలో కుట్రదారులు పడేసిన విద్యుత్ సర్వీస్ తీగ

పట్టపగలే మూడు గృహాల్లో చోరీ

- రూ.3.68 లక్షల నగదు, 76 గ్రాముల బంగారం మాయం

పామూరు: మండల కేంద్రం పామూరు ఎన్‌జీఓ కాలనీ 5వ లైన్‌లో ఓ ఇంట్లో, నేతాజీనగర్ ఒకటో లైన్ సమీపంలోని ఒకే నివాస గృహంలో వెనుక, ముందు వైపు ఇళ్లలో శనివారం ఉదయం వరుస చోరీలు చోటుచేసుకున్నాయి. మండలంలోని దూబగుంట్ల మాజీ సర్పంచ్ మితికాల గురుస్వామి నేతాజీ నగర్ 1వ లైను సమీపంలో నివాసం ఉంటున్నాడు. పనిపై గురుస్వామి నెల్లూరు వెళ్లగా అతని కుటుంబ సభ్యులు వైద్య పరీక్షల కోసం ఉదయం 9 గంటల తర్వాత ఆస్పత్రికి వెళ్లి 12 సమయంలో తిరిగి ఇంటికి వచ్చారు. అప్పటికే ఇంటి ప్రధాన డోర్, బీరువా తాళాలు, కబోర్డ్‌లు పగులగొట్టి ఉన్నాయి. నగదు, వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. నగదు రూ.1.5 లక్షలు, 64 గ్రాముల నగలు చోరీకి గురైనట్లు తెలిపారు. అదే ఇంట్లో బాడుగకు ఉంటున్న రమణారెడ్డి కుటుంబ సభ్యులు పనిపై బయటకు వెళ్లి 11.30 గంటల సమయంలో తిరిగి వచ్చారు. అప్పటికే ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా కబోర్డ్‌లో ఉన్న రూ.18 వేల నగదు మాయమైనట్లు చెప్పారు. సమీపంలోని ఎన్‌జీఓ కాలనీ 5వ లైన్‌లో నివాసం ఉంటున్న బి.కోటేశ్వరరావు, అతని భార్య ఉపాధ్యాయులు. ఇద్దరూ ఎప్పటిలాగే పాఠశాలకు వెళ్లారు. వారి పిల్లలు కూడా పాఠశాలకు వెళ్లారు. మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో కోటేశ్వరరావు ఇంటికి వచ్చి చూసేసరికి గ్రిల్ తాళాలు, ప్రధాన డోర్, బీరువా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలోని మొత్తం 12 గ్రాముల ఉంగరం, పాపటి బిళ్ల, ముక్కుపుడకలు రెండు, రూ.2 లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. చోరీలపై గురుస్వామి, కోటేశ్వరరావు, రమణారెడ్డిలు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాత్రి సంఘటన స్థలాలను ఎస్సై టి.కిషోర్‌బాబు, డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం పరిశీలించి వివరాలు సేకరిస్తున్నాయి. చోరీ సమయంలో ఓ కార్ ఆ ప్రాంతంలో సంచరించినట్లు స్థానికులు చెబుతున్నారు. పట్టపగలే చోరీలు జరగడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్, పక్కన ఎస్సై

స్థల వివాదంలో బంధువుల కొట్లాట

తాళ్లూరు: స్థలం వివాదంలో బంధువుల మధ్య కొట్లాట జరగడంతో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన మండలంలోని శివరామపురంలో శుక్రవారం రాత్రి జరిగింది. వివరాలు.. గ్రామానికి చెందిన పోటు వెంకటేశ్వర్లు, పోటు సీతయ్య అన్నదమ్ములు. వీరికి పక్క పక్కనే సొంత స్థలాలు వేర్వేరుగా ఉన్నాయి. ఆ స్థలాల్లో అన్నదమ్ములిద్దరూ మెరక తోలించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య వివాదం చెలరేగింది. మధ్యలో బంధువులు కలగజేసుకుని ఇద్దరికీ నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా వివాదం ముదిరి ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. వెంకటేశ్వర్లు బంధువు పోటు కోటయ్య తీవ్ర గాయాలతో ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. శనివారం ఉదయం సీతయ్య కుమారుడు విజయవాడ నుంచి వచ్చి వెంకటేశ్వర్లు బంధువు పోటు వీరాంజనేయులుపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. బంధువులు ఆయన్ను ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు పోలీసులు కౌంటర్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వీరాంజనేయులు మృతదేహం

నీటి రక్షణకు కృషి చేయాలి

- మంత్రి స్వామి

సింగరాయకొండ: ప్రతిఒక్కరూ నీటి రక్షణకు కృషి చేయాలని, నీటి నిల్వలను అభివృద్ధి చేసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి కోరారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మిస్తున్న రైతువారీ కుంటలకు శనివారం శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి పాల్గొన్న మంత్రి స్వామి తొలుత కనుమళ్ల పంచాయతీ పెద్దకనుమళ్లలో రైతువారీ కుంటకు శంకుస్థాపన చేశారు. జల రక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కొందరు రైతులు మాట్లాడుతూ సింగరాయకొండ నుంచి మురుగునీరు తమ గ్రామంలోని చెరువులో కలుస్తోందని, ఆ నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి, కలెక్టర్‌ను కోరారు. అనంతరం గురుకుల పాఠశాల వద్ద నూతనంగా రూ.24 వేలతో నిర్మించిన రైతువారీకుంటను వారు ప్రారంభించారు. జిల్లా, మండల స్థాయి అధికారులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.



కనుమళ్లలో రైతువారీ కుంటకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి డోలా, కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఎస్బీఐ ఉద్యోగి దుర్మరణం

దర్శి: మోటారు సైకిల్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొని ఎస్బీఐ ఉద్యోగి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన శనివారం తెల్లవారు జామున జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మద్దులూరి అన్వేష్‌బాబు కందుకూరు ఎస్బీఐలో పని చేస్తున్నాడు. మద్దిపాడు మండలం తెల్లబాబు గ్రామానికి చెందిన అన్వేష్‌బాబు తిరునాళ్ల సందర్భంగా దర్శికి వచ్చాడు. తెల్లవారు జామున స్వగ్రామం తెల్లబాడు వెళ్తూ మోటారు సైకిల్ అదుపుతప్పి చెట్టుకు బలంగా ఢీకొట్టాడు. చెవులు, ముక్కుల నుంచి రక్తం వచ్చి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గంటలో స్వగ్రామం వెళ్లాల్సిన అన్వేష్‌బాబు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరై విలపిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన తండ్రీకొడుకులు మృతి

టంగుటూరు: జాతీయ రహదారిపై టంగుటూరు టోల్‌ప్లాజా సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న తండ్రీకొడుకులు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందారు. రాంగ్‌రూట్‌లో వచ్చిన ట్రాక్టర్.. ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొనడంతో జరిగిన ఈ ప్రమాదంలో ఆటోలో ఒంగోలు నుంచి వస్తున్న జరుగుమల్లి మండలం చతుకుపాడు గ్రామానికి చెందిన ఒకే కుటుంబ సభ్యులు నలుగురు గాయపడ్డారు. వారిని 108 అంబులెన్స్‌లో ఒంగోలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం గుంటూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. వారిలో ఇట్ట వీరేంద్రబాబు (28), అతని కుమారుడు తన్మయి తేజ (2) మృతిచెందగా, వీరేంద్రబాబు భార్య హాసిని పరిస్థితి విషమంగా ఉంది. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టంగుటూరు ఎస్సై నాగమల్లీశ్వరరావు తెలిపారు.